

# లియోసా

డా॥ టి. సంపత్‌కుమార్

ఎంతైనా ఇంగ్లీషువాళ్లు పంక్చువాలిటీకి పెట్టింది పేరని బ్రిటిష్ ఏర్‌వేస్‌లోనే ప్రయాణించడానికి ఢిల్లీ నుండి హాంకాంగ్‌కు టిక్కెట్టు కొన్నాను.

అయితే అందుకు పూర్తిగా వ్యతిరేకంగా విమానం అయిదు గంటల ఆలస్యంతో ఢిల్లీ నుండి బయలుదేరడంతో నా ప్లాన్ ప్రకారంగా హాంకాంగ్ నుండి బీజింగ్‌కు వెళ్లే విమానంలో ప్రయాణించలేకపోయాను. చివరకు ఎలాగో కష్టాలు పడి అనుకున్న సమయానికి దాదాపు పన్నెండు గంటల ఆలస్యంతో బీజింగ్ ఏర్‌పోర్ట్‌లో అడుగుపెట్టాను. 'తెల్లోడి' ఆలస్యం వల్ల నన్ను రిసీవ్ చేసుకునేవారిని కలుసుకోలేకపోయాను. ఆదిలోనే హంసపాదు. ఇంతకూ నేను చైనా ఎందుకు వెళ్లిందీ చెప్పనేలేదు.

రెణ్నెల్ల ట్రైనింగ్ కోసం మా ఆఫీసు నన్ను పంపింది. ఈ ట్రైనింగ్ తతంగమంతా సుమారుగా ఓ ఆర్నెల్ల నుంచి జరుగుతోంది మా ఆఫీసులో దీన్ని గురించి నా చెవిన పడ్డప్పటి నుంచి ఎంతో సంతోషపడ్డాను. ఒక గొప్ప దేశాన్ని చూస్తానన్న కుతూహలం! అమెరికా, జర్మనీ, లండన్లను చూడటం తేలిక. కాని, చైనా... ఎంతో దగ్గర, సరిహద్దుకు ఆవలివైపే! అయినా ఎంతో దూరం- రాజకీయపరంగా!

అతికష్టంగా మా కాంటాక్ట్ మనిషిని కలుసుకోగలిగాను. నేను చైనా ట్రిప్‌ను రద్దు చేసుకున్నానేమోనని నా గురించి కంగారుపడ్డారట! అప్పటికే ఒక్క నేను తప్ప మిగతా ట్రైనీలంతా చేరుకోవటం, విశ్రాంతులు తీసుకోవడం జరిగాయట. పరిచయాలయ్యాక నా కష్టాలను వివరించాను. వారి సానుభూతి నేను పడ్డ కష్టాల్ని హరించివేసింది. మామూలు మనిషినయ్యాను. నిద్ర లేకపోవడంవల్ల కళ్లు మూతలు పడుతున్నాయి. డిన్నర్ పూర్తిచేసి, అందరం మా గదుల్లోకి వెళ్లిపోయాం. విడిపోయే ముందు మరుసటిరోజు కార్యక్రమ వివరాలు మా ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ తెలిపాడు. ఇంతకూ బీజింగ్‌లో ఉండేది రెండు రోజులే! మా ట్రైనింగ్ జరిగేది చెండు నగరంలో. ఇది సిచువాన్ ప్రావిన్స్ రాజధాని.

మంచి నిద్రపట్టడం వల్ల క్రితం రోజు అలసటంతా హుష్ కాకిలా ఎగిరిపోయింది. పొద్దున్నే మెలకువ వచ్చినా లేవబుద్ధి కాలేదు. కొంతసేపు- మరికొంతసేపనుకుంటూ కృత్రిమ చలిలో వెచ్చగా పడుకున్నాను. కో-ఆర్డినేటర్ చెప్పిన టైము గుర్తుకు కొచ్చి ముసుగును తన్నేసి కార్యక్రమాలకుపక్రమించాను.

అనుకున్న సమయానికి అందరూ ఒక్కరొక్కరుగా రెస్టారెంట్ చేరుకున్నారు. మెనూను తిరగేసి ఎవరికి తోచింది వారు ఆర్డరు చేశారు. మధ్యమధ్యలో కో-ఆర్డినేటరు చైనా డిష్‌ల గురించి తెలుపుతూ, రుచి చూడమంటూ ప్రోత్సహిస్తున్నాడు. బ్రేక్‌ఫాస్ట్ సంభాషణల జల్లుల మధ్య సాగుతోంది. సరిగ్గా ఆ సమయంలో మా అందరి దృష్టినీ అయస్కాంతంలా లాక్కుంటూ ఓ సుందరాంగి కో-ఆర్డినేటర్ దగ్గరకొచ్చి కరచాలనం చేసింది. కో-ఆర్డినేటర్ ఆమెను ఆహ్వానించి తన పక్కనే కుర్చీని ఏర్పాటుచేశాడు. ఆమె సుతారంగా అందరి వైపు చూస్తూ కూర్చుంది. కొంతసేపు వారిద్దరూ చైనా భాషలో ఏమో మాట్లాడుకున్నారు. కాసేపట్లో ఆమెకూ బ్రేక్‌ఫాస్ట్ వచ్చింది. ఎందుకో నాకు ఆమెను చూసిప్పటి నుంచి బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవడంలో తడబడుతున్నాననిపించింది. అందరూ ఆమెను దొంగచూపు

లతో దోచుకుంటున్నారేమోననిపించింది. అప్పటికి కో-ఆర్డినేటర్ ఆమెను మాకింకా పరిచయం చేయలేదు.

"లెట్ మి హేవ్ ద ప్లెజర్ ఆఫ్ ఇంట్రొడ్యూసింగ్ మిస్ లియోసా!" అని ఆమెను పరిచయం చేసి తాను మాకు ఇంటర్‌ప్రెటర్‌గా పనిచేస్తుందని, మాతోపాటు రెండు నెలలుంటుందని తెలిపాడు. కో-ఆర్డినేటర్ అప్పటికి ఇంకా మా పేర్లతో పూర్తి తర్ఫీదు కాకపోవడం వల్ల మమ్మల్నే ఆ పిల్లకు పరిచయం చేసుకొమ్మని కోరాడు. అందరూ వరుసగా పేర్లు, ఏ దేశం నుండి వచ్చింది చెబుతూ కరచాలనం చేస్తూ ముగించారు. నేను మటుకు పరిచయానికి మొదలు- 'మీరు కూడా మాతోపాటు ట్రైనీ అని అనుకున్నా,'నని జోక్ విసిరి మిగతా తతంగం పూర్తిచేశాను. చిన్నప్పుడు వల్లించిన 'చీనీ-హిందీ భాయి భాయి' అన్న మాట ఎందుకో నాకు జ్ఞప్తికొచ్చింది. రెండు దేశాలు పాత విషయాలను మరచి పోయి సత్సంబంధాలను నెలకొల్పుతున్నంత సంతోషం కలిగింది నాకు.

రైతు విత్తనాలు చల్లే ముందు భూమిని ఏ విధంగా తయారుచేస్తాడో అలా మమ్మల్ని ట్రైనింగ్‌కు మానసికంగా తయారుచేయడానికి ఓ భాగంగా బీజింగ్ లోని ముఖ్య స్థలాలను చూపేందుకు ఏర్పాటుచేశారు. అందులో తియానన్మాన్ స్క్వేర్, ఇంపీరియల్ భవనం, మావో మౌసోలియం, గ్రేట్ హాల్ ఆఫ్ పీపుల్‌లతోపాటు దగ్గరిలోని చైనాగోడను కూడా జోడించారు. ఇవన్నీ చూడటానికి బీజింగ్‌లో రెండు రోజులుంటాం.

"ఈరోజు మనం బీజింగ్ నగరంలోని టూరిస్ట్ ప్రదేశాల్ని చూద్దాం ! అందులో మొదటి తియానన్మాన్ స్క్వేర్ వెళ్దాం. దాని చుట్టుపక్కల చాలా ప్రదేశాలు న్నాయి. అవన్నీ చూడటానికి ఈరోజు సరిపోతుంది. రేపు గ్రేట్‌వాల్ ఎక్కుదాం!" మృదువుగా తీయని స్వరంతో ఎంతో వినయంగా ప్రకటించింది లియోసా.

ఇంగ్లీషు కరువైన చైనాలో లియోసా అరుదైన వ్యక్తిగా తోచింది. చక్కని ఉచ్చారణతో, ధారాళంగా ఇంగ్లీషు మాట్లాడుతోంది. హిస్టరీ చదివిందట! ఈమధ్య టూరిజం కోర్సు కూడా పూర్తి చేసిందట. మాకు మంచి ఇంటర్‌ప్రెటర్-కమ్-టూరిస్ట్ గైడ్ ఏర్పాటు జరిగిం దన్నమాట! లియోసా చెండు నగరం నుండి మా కోసం బీజింగ్ వచ్చింది. రెండు రోజులయ్యాక మాతోనే చెండుకు వస్తుంది. లియోసా చెండు నగర నివాసి.

పదిహేను నిముషాల్లో అందరం బుల్లి కెమేరా లతో మినరల్ వాటర్ బాటిల్స్‌తో ఇంకా కావలసిన సరంజామాతో సిద్ధమయ్యాం. ఒక గొప్ప దేశపు రాజ ధానిని చూడబోతున్నామన్న ఉత్సాహం ఉరకలు వేస్తూంటే బస్సెక్కి కూర్చున్నాం. నేనో వరసలో కిటికీ పక్క సీటు చూసుకున్నాను.

చక్కని ట్రాఫిక్ సంస్కృతిని ప్రతిబింబించే బీజింగ్ విశాలమైన రోడ్లగుండా బస్సు దూసుకుపో తోంది. రోడ్లకూడళ్ల వద్ద అందమైన ఆకట్టులు, మొక్కల విన్యాసాలు, నృత్యం చేసే ఫౌంటెన్లు... కన్నార్పకుండా చూస్తున్నాం. రోడ్లకిరువైపులా సైకిల్ నడిపేవారికి ప్రత్యేకమైన వరుస ఎంతో ముచ్చటగా తోచింది. విభిన్న రకాల సైకిళ్లపై, వివిధ రంగుల్లో ఆడా-మగా, బొద్దుగా ఉన్న పిల్లలు ముందుకు పోతుంటే పేదవారికి కూడా ఈ దేశంలో రోడ్డుపై తనకంటూ కేటాయించిన స్థల మున్నదని తోచింది.

ట్రాఫిక్ లైట్ల వద్ద చక్రాలు బ్రేకులు పడినప్పుడల్లా సైకిల్ ప్రయాణికుల్ని గమనిస్తూ కూర్చున్నాను. శ్వేత వర్ణంతో, నునుపు శరీరంతో, కురచ దేహాలు, గాఢమైన రంగు దుస్తులతో ఇంద్రధనుస్సును చూస్తున్న భావన కలిగింది. అక్కడ అప్పుడు వేసవి కాలం. ఎక్కువ శాతం మగవాళ్లందరూ నిక్కర్లలో ఉన్నారు. నిక్కర్లతో ఆఫీసు లకు కూడా వెళ్లొచ్చుట! ఈ విషయం తెలిసి నవ్వు కున్నాను. ఆడవాళ్లు కూడా నిక్కర్లు, స్కర్ట్‌లు వాడతారు. కన్నార్పితే ఎక్కడ ఏం మిస్సవుతానోనని, చిన్న కళ్లవారి దేశంలో వీలైనంతగా నా కళ్లను పెద్దవి చేసుకుని చూస్తూనే ఉన్నానో లేదో, బస్సు మెల్లగా ఓ విశాలమైన ఖాళీస్థలం దగ్గరకు చేరుకుంది. బస్సు స్పీడు తగ్గి పార్కింగ్ స్థలానికి చేరుకుంటున్నప్పుడు లియోసా ముఖం ఎర్రబడటం, సీరియస్ కావడం నేను గమనిం చాను. ట్రాన్స్‌లోకి వెళ్లినట్టుంది. బస్సులోనే ఓ మూడు నాలుగు నిముషాలు కూర్చుంది. ఆపాటికి అందరం బస్సులో నుంచి దిగడం, నలువైపులా చూపుల్ని సారిస్తూ లియోసాకోసం ఎదురుచూస్తున్నాం. లియోసా డ్రైవరుకు ఎక్కడ కలవాలో సూచనలిచ్చి వచ్చి మాలో చేరింది.

అదో విశాల మైదానం, నలువైపులా మహా కట్టడాలున్నాయి. జనసమ్మర్దం బాగా ఉంది. లియోసా మెల్లగా ప్రకటించింది- "ఇప్పుడు మీరు తియానన్మాన్ స్క్వేర్ పై ఉన్నారు!"

ఈ చదరం గురించి మరిన్ని వివరాలు చెబుతూ, చైనా రాజకీయాల్లో ఈ స్థలానికున్న ప్రాముఖ్యాన్ని చెప్పింది.

"మూడేళ్ల క్రితం జరిగిన విద్యార్థుల ప్రజా స్వాతంత్ర్య పోరాటం తాలూకు సంఘటనలు జరిగింది కూడా ఇక్కడే కదా!" అని అడిగాను.

బీజింగ్ యూనివర్సిటీ విద్యార్థుల ఆందోళన, ఎంతమంది స్కేర్‌పై మిలటరీ విధ్వంసకాండకు బలైందీ- అన్ని వివరాలతో తెలిపింది. ఎందుకో విద్యార్థుల పోరాటం, మృతి విషయాలు చెబుతున్నప్పుడు లియోసా కంఠం బరువైంది. గొంతు జీరపోయి మాటలు అతి మెల్లగా వచ్చాయి. కళ్లలో నీళ్లు నిండుకున్నట్లు గమనించకుండా ఉండలేకపోయాను.

ఆరోజు అలా దినమంతా అక్కడి ప్రదేశాలు చూడటంతో సరిపోయింది. లియోసా ఉండడంతో అడిగిన ప్రశ్నకల్లా జవాబు దొరికింది. ఎంతో సొగసుగా దినం గడిచింది కాబట్టి ఆరోజు మరువలేని దినంగా మా జీవితాల్లో నిలిచిపోయింది.

బస్సు తిరుగుముఖం పట్టింది. నేను కావాలనే లియోసా పక్కనున్న సీటులో కూర్చున్నాను. కొంత స్నేహం పెరిగింది. పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ, మధ్యమధ్యలో నేనడిగిన ప్రశ్నలకు ఓపిగ్గా జవాబులనిస్తోంది. అదను చూసి మాట్లాడాను-

"మీకేమీ అభ్యంతరం లేకపోతే ఓ మాటడుగుతాను!" కుతూహలంతో ప్రశ్నడిగినా, జవాబు ఎలా ఉంటుందో ఊహించుకోలేకపోతున్నాను.

"తప్పక అడుగు! తెలిస్తే చెబుతాను!" అంది ప్రశ్నకు ఆశ్చర్యపడుతూ, వింతగా నావైపు చూస్తూ.

"ఉదయం మన బస్సు తియాన్మాన్ స్క్వేర్ చేరాక దాని గురించి వివరిస్తున్నప్పుడు మీరు చాలా అసౌకర్యంగా ఉన్నట్లు, మీ ముఖ కవళికలు మారినట్లు, చివరగా మీ కళ్లు చెమ్మగిల్లడం గమనించాను." కొంతసేపాగాను. క్షణాలు గడిచాయి. మళ్లీ నేనే సాగించాను.

"ఇదంతా గమనించినప్పటి నుంచి ఎందుకో మిమ్మల్ని అడగాలనిపించింది. ఈ ప్రశ్న మీకు ఇబ్బంది కలిగించడం లేదుకదా! ఒకవేళ అలాంటిదే జరిగితే క్షమించండి! ఈ ప్రశ్నను కూడా మరిచిపోండి!" అన్నాను మర్యాదపూర్వకంగా.

లియోసా ముఖంలో రంగులు మారుతున్నాయి. ముఖాన్ని కిటికీ వైపు తిప్పుకుంది. కళ్లల్లో నిండుకుంటున్న నీరు నాకు కనబడకుండా కాబోలు.

ప్రశ్న అడిగి ఉండకూడదు అని మనసు తిడుతోంది.

తనను తాను అదుపు చేసుకుంటూ నావైపు ముఖాన్ని తిప్పింది. పెదిమలు వణుకుతున్నాయి. తెల్లనివర్ణం బీటు దుంపంత ఎర్రగా మారింది. మాటలు పలకడానికి అవస్థ పడుతున్నట్లుంది. భారమైన కంఠంతో- "తప్పక చెబుతాను!" అంది.

ఆమెను చూస్తూంటే ఎందుకడిగానా అని నేను వేదన పడుతున్నాను.

కొంతసేపు నిశ్శబ్దం. బయట ట్రాఫిక్ రొద.

రొదలో దూసుకుపోతున్న బస్సులో రెండు గుండెలు క్షణక్షణం బరువెక్కుతున్నాయి.

బస్సు రయ్‌మంటూ హోటలుకు చేరుకుంది. ఏ సమయానికి డిన్నర్‌కు కలుసుకోవాలో నిర్ణయించుకున్నాక అందరూ గదుల వైపు దారి తీశారు. లియోసా నా వైపు ప్రత్యేకంగా చూస్తూ వీడ్కోలు తీసుకుంది. ఆమె ఉండేది కూడా అదే హోటల్లో. గది మా ఫ్లోర్‌పైనే ఉందని తెలిపింది.

డిన్నర్ కోసం ఒక్కరొక్కరూ రెస్టారెంట్‌కు చేరుకుంటున్నారు. మీ దేశంలో ఏం తింటే బాగుంటుందో మీరే ఎంపిక చేస్తే బాగుంటుందని 'మెనూ' బాధ్యత లియోసాకు వదిలాం. "ఓ.కె!" అంటూ నవ్వుతూ బాధ్యతను స్వీకరించింది. మేమంతా ముచ్చటల్లో పడ్డాం. మధ్యమధ్యలో అప్పటికే సర్దిన చాప్‌స్టిక్స్‌ను ఎలా పట్టాలో, ఎలా వుపయోగించాలో అభ్యాసం చేస్తున్నా. అప్పుడప్పుడు స్టిక్స్ జారి చైనా పింగాణీ పాత్రలపై పడి తమాషాగా ధ్వనిస్తున్నాయి. ఒక ట్రైనీ కోలాటం మొదలెడితే, మరొకతను కత్తుల్లా చాప్‌స్టిక్స్‌ను ఆడిస్తున్నాడు.

అందరూ ఆకలితో ఉండడంతో గబగబా తినేసి ఎవరి గదుల్లోకి వారు నిష్క్రమించారు. నేను రూమ్‌కెళ్లి టీ.వీ. ఆన్‌చేసి బట్టలు మార్చుకోడానికుపక్రమించాను. సరిగ్గా అదే సమయంలో కాలింగ్ బెల్ మోగింది.

తలుపు తీసి చూస్తే లియోసా!

"ఏమ్ ఐ డిస్టర్బింగ్ యూ?" బయట నిలబడే అంది.

"ఓహ్ నాట్ ఎటాల్! వెల్‌కమ్! వెల్‌కమ్ టు మై రూమ్!" అని ఎయిర్ ఇండియా వారి మహారాజు ఫోటోలా ఆహ్వానించాను. కిలకిల నవ్వుతూ గదిలోకి ప్రవేశించింది.

నేను బట్టలు విప్పే పనిని వాయిదా వేసుకుని కుర్చీలో కూలబడ్డాను. ఇద్దరి మధ్యా నిశ్శబ్దం. ఇద్దరం

మౌనంగా ఉన్నాము. తుఫాను ముందరి ప్రశాంతి కోసమనేమో! లేచి టీవీని కట్టేశాను. దాదాపు మూడు నిముషాల తరువాత గొంతు పవరించుకుని, ''నీ ప్రశ్నకు నేను జవాబు చెప్పలేదుకదూ!'' అంది. గొంతులో వేదన, మాటల్లో బరువు, ఆర్ద్రత ఉన్నట్టనిపించింది.

''నేనా ప్రశ్న వేసి మిమ్మల్ని బాగా ఇబ్బంది పెట్టినట్టున్నాను. మీరు నన్ను క్షమించాలి!'' కళ్లల్లోకి చూస్తూ అన్నాను.

''మొదట మిమ్మల్ని మీ నిశిత పరిశీలనకు అభినందించాలి. అంతమంది ట్రైనీల్లో మీరొక్కరే నన్ను గమనించారు. మీ హ్యూమన్ టచ్ పట్ల నాకు ఆనందంగా ఉంది. మీ ప్రశ్నకు జవాబిస్తేనేగానీ నా మనసు తేలికపడదు. లేకపోతే ఈ రాత్రికి నిద్రపోలేనేమో!''

నేను సస్పెన్స్, కుతూహలాలతో లియోసా ముఖం వైపే చూస్తున్నాను. పొద్దుటి నుంచి పేరుకున్న మిస్టరీ విడిపోతుందన్న ఉత్సాహం కలుగుతోంది. ఆ చెమ్మగిల్లిన కళ్ల వెనక దాగి ఉన్న అనుభవం ఆమె చెబితే కాని తెలియదు. ఆమెనే గమనిస్తున్నాను.

''అది 1989వ సంవత్సరం. బీజింగ్ యూనివర్సిటీ విద్యార్థులు ప్రజాస్వామ్యం కోసం ఆందోళన చేపట్టారు. ఈ సంఘటన చివరకు సంఘర్షణగా మారి అంతర్జాతీయంగా అందరి దృష్టినీ ఆకర్షించింది. మీరు కూడా ఇండియాలో చదివి ఉంటారు!

''జాంగ్... జాంగ్‌హువా, నేను చిన్నప్పటి నుంచి చెండులో కలిసి చదువుకున్నాం.''

లియోసా కాసేపటివరకు మాట్లాడలేకపోయింది. శూన్యంలోకి చూస్తున్నట్లు గ్రహించాను. నిండుకున్న నీళ్లు ధారలై కళ్ల నుండి జారుతున్నాయి. పెదిమను బిగపట్టి దుఃఖాన్ని ఆపుకుంటూ సన్నగా ఏడుస్తోంది. అప్రయత్నంగా నా చేయి ఆమె నోదార్చడానికి ముందుకు జరిగింది. కాని ఎందుకో మరింత ముందుకు చాచలేకపోయాను. మనసులో నిండి వున్న బాధ కన్నీళ్ల రూపంలో బయటపడితే కాని తేలికపడదు. అందుకు ఆమెను నివారించలేదు. ఓదార్చనూ లేదు. కాసేపటికి తమాయించుకుంది. బ్యాగ్‌లో నుంచి రుమాలు తీసుకుని కళ్లకద్దుకుంది. ముఖం ఎంత ఎరుపెక్కిందో లైట్ల వెలుతురులో గమనించలేకపోతున్నాను.

లియోసా కళ్లు మూసుకుని సోఫాలో కాస్త కదిలి రిలాక్స్‌డ్‌గా కూర్చుంది. తలను కుషన్‌పై ఆన్చింది. జాంగ్‌హువా ఆలోచనలు తరుముకొస్తున్నాయి.

లియోసా, జాంగ్‌హువా తండ్రులు ఒకే పరిశోధనా సంస్థలో సైంటిస్టులు. ఇద్దరి కుటుంబాలూ కేంపస్ క్వార్టర్స్‌లో ఉండేవి. తోడుగా ఒకే వయసు కావడంతో చిన్నప్పటి నుండి లియోసా, జాంగ్ ఒకే స్కూల్లో, ఒక తరగతిలో చదివారు. పసిపిల్లలుగా వున్నప్పుడు కేంపస్‌లో, స్కూల్లో ఉన్నప్పుడు దాని ఆవరణలో అంటుకునే పెరిగినట్టు పెరిగారు. మూడు చక్రాల సైకిల్ రేసుల నుండి రెండు చక్రాల సైకిల్ పోటీల వరకు కలిసిమెలసి తిరిగారు. చిన్నప్పుడు ఓ రకం ఆకర్షణ లియోసా, జాంగ్‌లను దగ్గరగా ఉంచితే, కాలేజీలో చేరేసరికి అది క్రమేణా స్త్రీ-పురుషుల మధ్య జనించే పరస్పరాకర్షణగా రూపాంతరం చెందింది. కాలేజీ చదువుల్లో లైన్లు మారాయి. లియోసాకు గతంలోని నిజాలు ఆసక్తికరంగా తోస్తే, జాంగ్‌కు భవిష్యత్తులో రోజురోజుకూ చిక్కుముడులు విప్పే బయోటెక్నాలజీ ఆకర్షించింది. ఆ రంగంలో జరిగే వింతలను వివరించి చెబుతుంటే జాంగ్ కళ్లలోకి పులకించిపోయి చూస్తూండేది లియోసా. తానేం తక్కువకాదని చరిత్ర ఘట్టాల్ని, అప్పటి వైభవోపేతమైన జీవనసరళిని, వ్యవసాయ పద్ధతుల్ని, పశుసంపదల గురించి మొదలుకొని, రాణుల రమణీయ గాథల గురించి, అంతరంగిక సమస్యల గురించి తన్మయంగా చెబుతుంటే జాంగ్ లియోసా వైపే కనికట్టు చేసినట్టుగా చూస్తూండిపోయేవాడు. ప్రపంచంలోని అద్భుతాల్లో ఒకటైన చైనా గోడ గురించి లియోసా ఎన్ని రోజులు ముచ్చటగా చెప్పిందో? అప్పుడప్పుడు జాంగ్ జోక్ చేసేవాడు- చైనా గోడ పొడవును మించి మరీ సాగదీసి చెప్పావని. 'దీని గురించి ఎంత చెప్పినా తక్కువే,' అంటూ కొంటెగా జవాబిచ్చేది. 'అప్పుడప్పుడు చరిత్ర కూడా చదువు,' అని ఎగతాళి చేసేది.

ఇద్దరి యూనివర్సిటీ చదువులు పూర్తయ్యాయి. ఇరువురి కుటుంబాలూ పెళ్లికి ఏనాడో ఒప్పుకున్నాయి. రాజ్యాంగ సవరణల వల్ల చైనాకు టూరిస్టుల రద్దీ పెరిగింది. లియోసాకు వెంటనే మంచి ఉద్యోగం దొరికింది. చైనాలో అరుదైన ఇంగ్లీషు భాషలో లియోసా ప్రావీణ్యత సంపాదించడంతో జర్నలిజంకు సంబంధించిన ట్రైనింగ్ కూడా పూర్తిచేసింది. జాంగ్ మాత్రం బయో టెక్నాలజీలో రీసెర్చ్ చేసి డాక్టరేట్ కోసం బీజింగ్ యూనివర్సిటీని దృష్టిలో పెట్టుకున్నాడు.

తనకారోజు బాగా గుర్తుంది. జాంగ్‌కు బీజింగ్ యూనివర్సిటీలో సీటు వచ్చిందని తెలిపిన రోజు.

లియో దగ్గరకు పరుగెత్తుకుని వచ్చాడు. అతని సంతోషానికి అవధుల్లేవు. లియోసా ముఖం నిండా ముద్దులు నింపి, గట్టిగా హత్తుకుని, గిరగిరా తిప్పాడు. అనుకున్నది సాధించానన్న తృప్తి, గర్వమూ తొణికిసలాడాయి. అతని సమక్షంలో పాలలో సంచదారలా కరిగిపోయిందా రోజు లియోసా.

డాక్టరేటు ఎంత కాదన్నా నాలుగైదు సంవత్సరాలు. పరిశోధనకు అంతంటూ లేదు. బయోటెక్నాలజీలో ఎంతకాలం పడుతుందో ఏమో? మనసులో ఓ మూలన సంతోషం చోటు చేసుకున్నా, జాంగ్‌ను వీడి ఉండటం గురించి ఊహించుకోలేకపోతోంది. చిన్నప్పటి నుండి కలిసి పెరిగారు. పెరుగుతూ ఎదిగారు. ఒకరిపై ఒకరు అలక వహించేవారు. అరగంటలో కలిసిపోయేవారు. దీర్ఘంగా ఆలోచించి చూస్తే అసలు ఇంతవరకు జాంగ్‌ను చూడకుండా ఒకవారం రోజులు కూడా లేనని తెలుసుకుంది. అలాంటిది నాలుగు సంవత్సరాలు ఎలా గడిపేది? ఆ విషయాన్నే తల్లిదండ్రులతో ఆ రాత్రి భోజన సమయంలో కదిలించింది. జాంగ్ లేకుండా ఉండలేనని వెక్కివెక్కి ఏడ్చింది. తల్లిదండ్రులు చూస్తూ ఉండిపోయారే తప్ప ఓదార్చలేకపోయారు.

ఎంతసేపు ఏడ్చిందో ఏమో, లియోసా ముఖం ఎర్రగా మారింది. శరీరంలోని రక్తమంతా ముఖంలోకి చేరుకుందా అన్నట్లుగా ఉంది. తండ్రి నెమ్మదిగా కూతురి దగ్గరికి చేరి తలపై చేతులేసి నిమురుతూ ఓదార్చే ప్రయత్నం చేశాడు.

''సా!'' ఇంట్లో లియోసాను అలా పిలుస్తారు.

''జాంగ్ చాలా పట్టుదల మనిషి. చిన్నప్పటి నుండి నువ్వు చూస్తూనే ఉన్నావుగా! బయోటెక్నాలజీలో డాక్టరేట్ తన జీవిత లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది అంతార్జాతీయ స్థాయిలో చాలా వేగంగా పైకి వస్తున్న పరిశోధనారంగం. మంచి భవిష్యత్తు ఉంటుంది. అతన్ని సెంటిమెంట్ సాలెగూటికి లాగకు! రేపు సుఖపడేది మీరేకదా! జాంగ్ దగ్గర నీవు మనసులో బాధపడుతున్నావని బయటపడకు. తానూ బాధపడతాడు. చదువూ, పరిశోధనల పైనే తన దృష్టిని కేంద్రీకరించేటట్టు జాంగ్‌ను బీజింగ్‌ను పంపడం నీ బాధ్యత. ఎడబాటును కడుపులో దాచుకో! చదువుకున్నదానివి, పై చదువుల ప్రయోజనాలు, విలువలు నీకు బాగా తెలుసు. నేను ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అన్నీ తెలిసినదానివి!'' అంటూ లియోసా తండ్రి ఎంతో ఓదార్పుతో నచ్చజెప్పి మెల్లగా పరిస్థితిని అదుపులోకి తెచ్చాడు.

చిన్నప్పటి నుండి తండ్రి బుజ్జగిస్తేనే లియోసా మామూలు మనిషవుతుందని తెలిసి తల్లి దగ్గరకు పోలేదు. తండ్రి కూతుళ్లనే ఏకాంతంగా వదిలింది. జాంగ్ లేకుండా 'సా' ఉండదలేదన్న విషయం తెలిసి ఆ కన్నతల్లి మనసు పిండినట్టయింది.

సాయంత్రం వరకు లియో మామూలు మనిషైనట్టు గ్రహించి తల్లిదండ్రుల మనసులు తేలికపడ్డాయి.

నెలవంక రోజుకింత పెరిగి నిండు పున్నమైంది. జాంగ్ బీజింగ్‌కు వెళ్లే రోజు వచ్చింది. లియోసాకు క్షణక్షణం మనసు పీకుతూనే ఉన్నా, ఎక్కడా బయట పడకుండా జాగ్రత్తపడుతోంది. ఇంట్లో తల్లిదండ్రుల ముందు మామూలుగా ఉంటూ, జాంగ్‌కు హుషారుగా కనిపిస్తూ, ఒంటరిగా ఉన్నప్పుడు మాత్రం కుమిలిపోయేది. పక్కమీది నుంచి లేచినప్పటి నుండి లియోసాకు మనసు మనసులో లేదు.

ఎవరో జాంగ్‌ను తన నుండి లాక్కెళ్తున్నట్టు పిరికితనం రాజుకోసాగింది. ఇంకా కొన్ని గంటల్లో జాంగ్ తన నుండి దూరంగా వెళ్లిపోతాడు. చిన్నప్పుడు స్నేహితుడుగా, టీనేజ్‌లో బాయ్‌ఫ్రెండ్‌గా, కాలేజీ జీవితంలో ప్రియుడుగా ఎదిగిన తన జాంగ్ లేకుండా ఉండడాన్ని ఊహించుకోలేకపోతోంది. పిచ్చిదానిలా తన గదిలో పచార్లు చేస్తోంది.

గదిలో జాంగ్ మాటలు విని మామూలు మనిషయ్యేందుకు యత్నం చేస్తోంది. వెళ్లేముందు తన తల్లిదండ్రులకు చెప్పేందుకు వచ్చినట్లు గ్రహించింది. ఉత్సాహాన్ని శరీరం నిండా నింపుకుని చిరునవ్వును అరువు తెచ్చుకుని ముందు గదిలోకి వెళ్లి జాంగ్ పక్కనే కూర్చుంది. తన తండ్రి పెద్దరికపు సలహాలిస్తున్నాడు. అప్పుడప్పుడు ఉత్తరాలు రాస్తూండమని ప్రేమతో వాత్సల్యపూరితంగా చెబుతున్నాడు.

కాసేపయ్యాక లియోసా జాంగ్‌ను సాగనంపడానికి బయలుదేరింది. తల్లిదండ్రులు తమ కూతురు చెయ్యిలో చెయ్యి వేసి జాంగ్‌తో బయలుదేరుతున్న దృశ్యం చూసి ఎంతో సంతోషించారు.

*

ఎప్పుడూ ఉత్తరాలు రాసుకునే అవసరం కలగలేదు. అలాంటిది జాంగ్ నుండి ఎపుడెప్పుడు ఉత్తరం వస్తుందా అని ఎదురుచూసింది లియోసా. సుమారుగా వెళ్లిన పదిహేను రోజులకు ఉత్తరాన్ని అందుకుంది.

ఏదో వింత తొలకరి అనుభవం! జాంగ్ రాసిన చైనీస్ అక్షరాలను మృదువుగా నిమిరి ఉత్తరాన్ని సుతారంగా ముద్దుపెట్టుకుంది. ఉత్తరాన్ని చాలాసార్లు చదివింది. ఎన్నిసార్లు చదివిందో లెక్కతప్పింది. ఉత్తరాల అవసరం పడని వారి ప్రేమ జీవితంలో ఎప్పుడూ కళ్ల అల్లరి చూపులు, మాటలు, చిలిపిచేష్టలు చోటు చేసుకునేవి. అలాంటిది ఇప్పుడు వారికి ఉత్తరాల్లోని పదాలు, వాక్యాలు విత్తనంలో మహావృక్షం దాగి ఉన్నంత భావాన్ని మోసుకు వస్తున్నాయి. ఒక్కొక్క వాక్యం చదువుతున్నకొద్దీ భావం విస్తరిస్తుంటే లియోసా ఒళ్లంతా తెలియని అనుభూతితో పులకరించేది. అదుపుతప్పి జాంగ్ ఫోటోను ఎన్నిసార్లు ముద్దాడిందో!

వారికో కొత్త భాష దొరికింది. అది వారిని కొత్త లోకాల్లోకి తీసుకెళ్లింది. శరీరాలు ఎన్నో వందల మైళ్ల దూరంలో ఉన్నా, వారి మనసులు మాత్రం కలిసి ఉండేవి. గుసగుసలాడుకునేవి. ముచ్చట్లాడుకునేవి. రెండు హృదయాలకు ఉత్తరాలు వంతెన వేశాయి.

గంటల్ని దినం దాచుకుంటే దినాల్ని వారం మింగేస్తుంది. నేనున్నానంటూ నెల వచ్చి వారాల్ని తనలో కలుపుకుంటుంది. సూర్యుడు ఉదయిస్తూనే ఉన్నాడు. ఉదయించినవాడు అస్తమిస్తున్నాడు. పగలు రాత్రికి రాజ్యాన్ని వదులుతుంది. రాత్రి పగటికి అదే రాజ్యాన్ని పదిలంగా అప్పజెపుతుంది. జాంగ్ నుండి ఉత్తరాలు వస్తున్నాయి. లియోసా నుండి ఉత్తరాలు వెళుతున్నాయి. అయితే ఉన్నపళంగా ఎందుకో కొన్ని రోజుల నుండి జాంగ్ నుండి ఉత్తరాలు రాకపోవడం లియోసాకు ఆందోళన కలిగించింది.

ఎన్నో రోజులు ఎదురుచూసింది. పనితో బిజీగా ఉన్నాడేమోనని సర్దుకుంది. మరికొన్ని రోజులు గడిచాయి. ఆరోగ్యం బాగాలేదేమోనని ఆలోచించింది, అయినా ఉత్తరం మాటే లేదు. జాంగ్ తల్లిదండ్రుల్ని ఉత్తరం గురించి అడిగితే, వారు తనకేమైనా వచ్చిందే మోనని అడిగారు. అందరూ గాభరా పడిపోయారు.

పందొమ్మిది వందల ఎనభై తొమ్మిదవ సంవ త్సరంలో ప్రజాస్వామ్యం కోసం భారీ ప్రదర్శనలు, ఊరేగింపులు బీజింగ్‌లో ఉప్పెనలా ఎగుసుకొచ్చాయి. దీంట్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు. ఈ ఆందో ళనకు విద్యార్థులు తియానన్మాన్ స్క్వేర్‌పై తిష్ఠ వేశారు. ఉద్యమకారులపై సైన్యం విరుచుకుపడటంతో అది అక్కడితో నమసిపోయింది. దాదాపు రెండు వందల మంది విద్యార్థులు ప్రాణాల్ని కోల్పోయారు. అందులో జాంగ్... నా జాంగ్ ఉన్నాడని తరువాత తెలిసింది.

నాకు చరిత్ర ఇష్టమని, ఇంత తొందరగా చరిత్రలో కలిసిపోతాడని నాకు తెలియదు!"

పెదిమలు సన్నగా వణుకుతున్నా, మాటలు స్పష్టంగా వచ్చాయి.

నేను వింటూనే ఉన్నాను.

నిశ్శబ్దం...

"నా జాంగ్ ఆ స్క్వేర్ పైనే చనిపోయింది!

"మా ప్రేమ అక్కడే అంతమయింది!

"మా స్నేహం తెగిపోయింది అక్కడే!"

క్రమంగా ఆమె స్వరం హెచ్చుతూ వచ్చింది.

గట్టిగా ఏడుస్తోంది లియోసా. నేను ఆపే ప్రయత్నం చేయలేదు. ఏడుపు ప్రకృతి ప్రసాదించిన భావప్రకటన. అది పూర్తిగా ఆ క్షణంలో వ్యక్తమవుతే కాని మనసు తేలికపడదు. నేను ఓదార్చే ప్రయత్నం ఏ మాత్రమూ చేయలేదు. ఉధృతంగా కురుస్తున్న వర్షాన్ని ఎలా ఆపగలను?

కాసేపటికి మమూలు మనిషి అయింది. ఎంతటి వర్షమైనా ఎప్పుడో ఒకప్పుడు ఆగకమానదు. లియోసా సంతోషంగా ఉండే ప్రయత్నం చేస్తోంది.

వాచీ చూసుకుంది.

"ఓ మై గాడ్! పదకొండవుతోంది! రేపు పొద్దున్నే బయలుదేరాలి!" అంటూ సోఫాలో నుంచి లేచింది.

"ఐ యామ్ ఎక్స్‌ట్రీమ్లీ సారీ ఫర్ ఆల్ దిస్! పొద్దున్న కుతూహలం కొద్దీ అడిగిన ప్రశ్న వెనుక ఇంత విషాదం ఉంటుందని ఊహించలేకపోయాను. నేను చాలా బాధపడుతున్నాను!" అని తెలిపాను.

"నీతో ఈ విషయాన్ని పంచుకోవడం వల్ల కాబోలు, ఇప్పుడు నాకు చాలా రిలీఫ్‌గా ఉంది," అంది తేలికపడ్డ మనసుతో.

"గుడ్ నైట్!" అని సెలవు తీసుకుంది.

గది బయటి వరకు సాగనంపి బట్టలు మార్చు కున్నాను.

లియోసా ఆలోచనలతో భారమైన హృదయంతో పక్కమీద ఒరిగిపోయాను.

*

మరునాడు 'ది గ్రేట్ వాల్ ఆఫ్ చైనా' చూడ టానికి బయలుదేరాం. బీజింగ్‌కు సుమారుగా అరవై కిలోమీటర్ల దూరంలో బడలింగ్ అనే చోట చైనాగోడను చూడవచ్చు. ట్రైనీలందరమూ పైకి ఎక్కాక గోడ చరిత్ర నంతా వివరంగా తెలిపింది లియోసా. గోడను, పరి సరాల్ని చూడటానికి మూడుగంటల సమయం

ఇచ్చారు. ట్రైనీలంతా నాలుగైదు గుంపులుగా విడిపోయారు. చివరగా నేను, లియోసా మాత్రమే ఉండిపోయాం.

లియోసా రాత్రి తన జాంగ్ గురించి తెలిపాక మా ఇద్దరి మధ్య కొత్తదనం ఏ మాత్రం లేనట్టనిపించింది. ఇద్దరికి ఎన్నో ఏళ్ల నుండి పరిచయం ఉన్నట్టుగా వుంది. ఒక్క మాటతో పది కాలాలపాటుండే స్నేహాన్ని పొంద వచ్చంటారు. అదే జరిగింది నాకు, లియోసాకు మధ్య చైనా గోడంత పాత స్నేహంగా అనిపిస్తోంది. గోడపై ఇద్దరం ఒక్కొక్క అడుగు వేస్తూ ముందుకు కదులుతుంటే మా స్నేహం చైనా గోడలా పటిష్టమై కలకాలం నిలిచిపోతుందన్న నమ్మకం, ఆత్మవిశ్వాసం కలిగాయి.

అందరినీ ఆకట్టుకునేటట్టుగా ప్రతి విషయం గురించి కొంత, కొన్ని విషయాల గురించి విపులంగా చైనాగోడ పట్ల తెలిపినా, నలువైపులా అద్భుత కట్టడాన్ని పరిశీలిస్తూనే నేనడిగిన ప్రశ్నకల్లా లియోసా ఓపిగ్గా సమాధానం చెబుతోంది. రాజుల పేర్లు గుర్తుంచుకోడానికి ఇబ్బందిగా ఉంది. పేర్లు తమాషాగా ఉంటాయి. తోడుగా విలక్షణమైన ఉచ్చారణ మరింత కఠినంగా వుంటుంది.

బీజింగ్‌లో మూడు రోజులుండి ఆ సాయంత్రం చెండు నగరానికి బయలుదేరాం. ట్రైనీలందరు మెల్ల మెల్లగా చైనా వాతావరణానికి, తిండికి అలవాటు పడుతున్నారు. బీజింగ్ నుండి చెండుకు రెండు గంటల విమాన ప్రయాణం. కో-ఆర్డినేటర్, లియోసా అంతా సవ్యంగా జరిగేటట్టుగా, మాకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అతి జాగ్రత్తగా, బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తున్నారు.

బీజింగ్ ఏర్‌పోర్ట్ చేరాక లియోసా అందరి టిక్కెట్లనూ తీసుకుని సహకరిస్తోంది. కో-ఆర్డినేటర్ లగేజి లెక్కించడంలో నిమగ్నుడయ్యాడు. కిటికీ పక్క సీటు కావాలని లియోసాకి తెలిపాను. కౌంటర్ దగ్గరి తతంగమంతా పూర్తి చేసుకుని బోర్డింగ్ పాస్‌లను పట్టుకుని ఫ్లైట్ ఎక్కడానికి బయలుదేరాం.

కోరుకున్నట్లుగా నాకు సీటు దొరికింది. కనబడినంతవరకు చూపు సారించి గమనిస్తున్నాను. దూరంగా రన్ వే కనబడుతోంది ఏదో ఫ్లైట్ మెల్లగా వేగాన్ని పుంజుకుంటోంది. అంతలోనే లియోసా వచ్చి నా పక్క సీటులో కూర్చుంది. సంతోషంగా ఉంది నాకు. ఒకవైపు కనిపించే కిటికీ ఉంటే, మరోవైపు వినిపించే వ్యక్తి. దృశ్య, శ్రవణాల జోడీ! భలే అనుకున్నాను. కొత్త విషయాలు నేర్చుకునే జిజ్ఞాస ఉన్న నాకు ఇంతకంటే ఏం కావాలి?

లియోసా తన నడుముకు సరిపోయేంతగా సీటు బెల్టును సరిచేసుకుంటోంది. ఎంత తగ్గించినా ఇంకా చాలా వదులుగానే ఉంది బెల్టు!

"చెండు పెద్ద నగరం. కోటికి పైగా జనాభా. సిచువాన్ ప్రావిన్స్‌కు రాజధాని కావడంతో ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. చారిత్రాత్మకంగా, సాంస్కృతికపరంగా ఎంతో విశేషమైన స్థలం. చైనాలో ఎక్కువ శాతం సైంటిస్టులు, టెక్నాలజిస్టులు ఈ ప్రావిన్స్ నుండే వచ్చారు!" ఇంకా ఇంకా చెబుతూ పోతోంది, లియోసా చూడబోతున్న నగరం గురించి. వ్యవసాయం నుండి పశుసంపద వరకు, పరిశ్రమల నుండి పాలన వరకు, చదువుల నుండి పెళ్లిళ్ల వరకు, అడవుల నుండి ఆచారాల వరకు వివరిస్తోంది. మధ్యమధ్యలో అడిగిన చిరు ప్రశ్నలకు సమాధానమిస్తూ, తినబోతూ రుచి అడగడం ఎందుకని, చివరకు- "ఐ యామ్ ష్యూర్ యు విల్ ఎంజాయ్ యువర్ స్టే ఇన్ చెండు!" అని చివరగా ప్రకటించింది.

మరికొన్ని నిముషాల్లో చెండుకు చేరుకున్నాం. అక్కడే ఆరు వారాలుండేది. మా ట్రైనింగ్ జరిగేది అక్కడే!

*

ట్రైనింగ్ కోర్సు చాలా ఆసక్తికరంగా సాగుతోంది. కొత్త విషయాలు బాగా నేర్చుకుంటున్నాం. రోజూ నాలుగు లెక్చర్లు. పేరుకు పెద్ద సైంటిస్టులైనా, పేరు మోసిన ప్రొఫెసర్లయినా ఇంగ్లీషు రాదు. ఇంటర్‌ప్రెటర్ తప్పనిసరి. అంటే ఒకో లెక్చర్ పూర్తవడానికి రెండింతల టైము పడుతోంది. వారాంతాల్లో ఫీల్డ్ విజిట్‌లు, సైట్ సీయింగ్‌లను సమపాళ్లల్లో మిళితం చేశారు. లియోసా అప్పుడప్పుడు కొన్ని లెక్చర్లకు ఇంటర్‌ప్రెటర్‌గా పని చేస్తుంది. బయటికెళ్లినప్పుడల్లా మాతో ఉంటూ డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌లో షాపింగ్ మొదలుకుని టూరిస్ట్ గైడ్ వరకు అక్షరాలా లియోసా తలలో నాలుకలా సహకరిస్తోంది.

రోజులు గడుస్తున్నాయి. మేమొచ్చి మూడు వారాలు కావస్తోంది. చైనా జీవనం క్రమేణా అర్థం అవుతోంది. చప్పటి తిండికి అలవాటు పడిపోయాం. చాప్ స్టిక్స్ పట్టుకుని తినడం కూడా వచ్చేసింది. సూప్‌ల్లో రకాల లెక్క తప్పం. అందులో కప్పల సూప్ కూడా ఉంది. చిన్నప్పుడు చైనాలో కప్పల్ని తింటారని తెలిసి ఛీ కొట్టిన నేను మజా చేశాను. ఇదే విషయాన్ని

లియోసాతో చెబితే చిత్రంగా పకపకా నవ్వింది. పాముల సూప్ తాగమంటూ కొంటెగా బలవంతం చేసింది. చిన్న చిన్న పదాలు నేర్చుకున్నాం. నేను ఓరోజు లియోసాతో కూర్చుని మామూలు వాడుక పదాలను, వాక్యాలను చైనా భాష లో ఏమంటారో రాసుకున్నాను. ఆమె ఎంతో ఓపిగ్గా ఉచ్చారణను జాగ్రత్తగా రాసుకునేందుకు తోడ్పడింది. పదాలతోపాటు ప్రదేశాల పేర్లూ నోట్ చేసుకున్నాను. అయినా పలకడం ఎంతో కఠినంగా ఉందని తెలిపాను. "మీరు పేర్లు ఎలా పెడతారో అన్నదాని గురించి మా దేశంలో ఒక జోకుంది!" అని అన్నాను లియోసా కళ్లల్లోకి చూస్తూ.

"ఏంటది?" అంది.

"పాప పుట్టాక మీరు ఒక స్టీలు చెంచాను ఫ్లోర్‌పై విసురుతారట! అది ఎలాంటి శబ్దం చేస్తుందో దాన్నే పేరుగా పెడతారని చెప్పుకుంటాం!" అన్నాను కొంటెగా నవ్వుతూ.

ఇది విని లియోసా నవ్వాపుకోలేకపోయింది. బుగ్గలు ఎరుపెక్కే వరకు నవ్వింది.

సామాజిక పరిస్థితులు, ఫామిలీ ప్లానింగ్, మావో, కాంట్రాక్ట్ రెస్పాన్స్‌బిలిటీ సిస్టమ్, మహిళల స్థితిగతులు, హాంకాంగ్ వారికి ఎప్పుడు వశం కానున్నది, మారుతున్న సంస్కృతి- ఒకటేమిటి- ఇలా ఎన్నో విషయాలు మా మధ్య చర్చాంశాలు అయ్యేవి. నేను ఎంత ఆసక్తితో తెలుసుకునే ప్రయత్నం చేసేవాడినో, అదే స్థాయిలో లియోసా కూడా ఇండియా గురించి చాలా విషయాలు అడిగేది. పక్క దేశాలే! కానీ కొన్ని విషయాల్లో ఉత్తర దక్షిణ ధ్రువాలంత తేడా ! అవి తెలుసుకుని ఎంతో ఆశ్చర్యపడేవాళ్లం. విచారించేవాళ్లం కూడా. ఒక దేశం నుండి మరొకటి ఎంతో నేర్చుకునేదుందని అభిప్రాయ పడేవాళ్లం. మామూలు మానవుల ఆలోచనలు పాలకులకెందుకు రావోనన్న విషయం అర్థం అయ్యేది కాదు!

రోజులు గడుస్తున్న కొద్దీ నేనూ, లియోసా దగ్గరవుతున్నాం. లియోసా తన విధి తాను నెరవేర్చుకుపోతోంది. అందరు ట్రైనీలతో మర్యాదపూర్వకంగా మాట్లాడుతుంది. ఎవరికీ ఎలాంటి లోటూ రాకుండా మసలుకుంటోంది. షాపింగ్‌లో అందరి ఆతురతను గ్రహించి, ఓపిగ్గా విని, వెంటనే తర్జుమా చేసి అన్నీ సమకూర్చడంలో ఎంతో చాకచక్యం చూపిస్తుంది. ఎక్కడా అలసటన్నది మాటల్లో కాని, చేష్టల్లో కాని కానరాదు. సమయస్ఫూర్తితో, మృదువైన హాస్యంతో అందరినీ నవ్వించేది. నన్ను మాత్రం ఎంతో భిన్నంగా చూసుకునేది. తియానన్మాన్ స్క్వేర్‌లో అంకురించిన మా స్నేహం కొన్ని రోజుల్లోనే ఎన్నో కొత్త ఆకుల్ని తొడిగింది. మాటలు చర్చల్లోకి, చర్చలు వ్యక్తిగత అభిప్రాయాల్లోకి దారితీసేవి. ఎక్కువమటుకు మా ఇరువురి అభిప్రాయాలు పరిశీలనలు సుమారుగా సరిపోయేవి. అభిప్రాయాలు కలవనిచోట ఇద్దరి వాదాలు బలంగానే తోచేవి. ఈ ప్రక్రియలన్నీ మా ఇద్దరిని మంచి మిత్రులుగా చేశాయి. అప్పుడప్పుడు మా అంతరాల్లో ఉన్న ఆడ-మగతనాలు బయటపడేవి. దోబూచులాడుతూ బుట్టలోకి పాము జర్రుమని విరమించుకున్నట్టుగా అంతరాల పొరల్లోకి మళ్లీ దూరిపోయేవి. నాలో ఈ పరిణామం నాకు బాగా తెలుసు. లియోసాలో కూడా ఇలాంటి పరిణామమే కలుగుతోందని ఆమె కళ్లు అప్పుడప్పుడు చెప్పాయి.

మరో వారం గడిచింది. వారాంతంలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన చైనా సిల్కు షాపింగ్ పని పెట్టుకున్నాం. లియోసాను ట్రైనీలందరూ ఈ షాపింగ్‌లో సహాయం చేయమని కోరారు. సంతోషంతో అంగీకరించింది. అందరివద్దా పెద్ద జాబితాలు ఉన్నాయి.

రాణీ ఈగలా లియోసా తోవ చూపుతుంటే మేమంతా ఆమె ననుసరించి ఓ పెద్ద దుకాణంలో అడుగుపెట్టాం. ఒకదానితో మరొకటి పోటీపడే రంగులు. క్షణక్షణం నిర్ణయం మార్చుకునేటట్టు చేసే డిజైన్‌లు. అందులో అందరం మగపురుగులం. కట్టే దొకరు, ఎంపిక చేసేదొకరు. సిల్క్ సముద్రంలో, డిజైన్ల తరంగాల్లో ఏ తరంగాన్నీ పట్టుకోలేక ఎంపిక ఒక సమస్యయింది మాకు.

లియోసా ఓపిగ్గా సమస్యను గ్రహించి ఎంపికలో తోడ్పడింది. కట్టేవారి రంగు తెలుసుకుంటూ మరీ ఏది బాగుంటుందో సూచించింది. నాకూ చీర ఎంపికలో చేయూతనిచ్చింది. చీర కోసం ఐదున్నర మీటర్లు తీసుకుంటుంటే ఆశ్చర్యంగా, వింతగా చూసింది.

"మీ ఒక్క చీరలో మా చైనా అమ్మాయిలు రెండు మూడు స్కర్ట్‌లు కుట్టించుకోవచ్చు!" అంది నవ్వుతూ.

"మా సంస్కృతిలో చీరలు చేసే చమత్కారాలు అనేకం. అవి చేసే అద్భుతాలు అమోఘం! టీనేజ్ అమ్మాయి ప్రేమ పొందాలన్నా, అర్ధాంగి కోపం తగ్గించాలన్నా, పత్రికల సర్క్యులేషన్ పెంచాలన్నా, సినిమాను వందరోజులాడించాలన్నా, మరుగుపడిన హీరోయిన్

మళ్లీ తెరకెక్కాలన్నా చీరలు ప్రముఖ పాత్ర వహిస్తాయి,'' అని పెద్దగా కళ్లు తిప్పుతూ బదులిచ్చాను.

సుమారుగా మూడు గంటలు గడిపి అందరూ తృప్తిగా సిల్కు షాపింగ్ పూర్తి చేసుకుని బయటపడ్డారు. ఆరోజు అలా గడిచిపోయింది.

మరునాడు ఆదివారం.

వచ్చేవారం చెప్పే లెక్చర్ నోట్స్ ముందే ఇవ్వడంతో తీరిగ్గా చూస్తున్నాను. వివరాలు తెలుసుకోవలసిన పాయింట్లను నోట్ చేసుకుంటున్నాను.

బెల్ శబ్దం చేస్తే వెళ్లి తలుపుతీశాను.

ఎదురుగా లియోసా!

మోహిని కదిలి వచ్చిందా అన్నట్టుగా ఉంది.

మోనాలిసా మరికొంత అందాన్ని పెంచుకుని లియోసా రూపంలో వచ్చిందా అన్న భ్రమ కూడా కొంత సేపు కలిగింది. పెర్‌ఫ్యూమ్ ఆమెను వదిలి నా ముక్కు రంధ్రాల ద్వారా శరీరమంతా ఇంకిపోతున్న ఫీలింగ్!

కనీస మర్యాద మరచి అలా ఆమెనే చూస్తూండిపోయాను.

''ఐ యామ్ సారీ!'' లోపలికి రమ్మనడమే మరిచాను.

''ప్లీజ్ గెట్ ఇన్!'' తేరుకుని అన్నాను. నా ప్రవర్తన విచిత్రంగా ఉండటం గమనించి ముసిముసి నవ్వులతో లోపలికి దారితీసింది. తలుపు దానంతటదే మూసుకుంది.

కూర్చోడానికి సోఫా చూపించాను. టేబుల్‌పై పరచి ఉన్న నోట్సును పరిశీలిస్తోంది.

''మీ పనిని భంగపరచలేదు కదా!'' అని కళ్లల్లోకి చూస్తూ అంది.

''అబ్బే, లేదు!'' అన్నాను. ఆమె నా శరీరం నుండి శక్తిని మెల్లగా పీల్చుకున్నట్టుగా ఉంది.

''వెయిటే మినిట్!'' సోఫాలో నుంచి లేచి టీ చేయడానికుపక్రమించాను. థర్మాస్‌లోని వేడినీళ్లతో బ్లాక్ టీని సిద్ధం చేశాను. ఓ కప్పును లియోసాకు అందించాను.

''తిండి ఎలాగో తినగలుగుతున్నాను. కాని మీ టీ మాత్రం తాగలేకపోతున్నాను. అందుకే వైటెనర్, షుగర్ క్యూబ్స్ తెచ్చిపెట్టాను!'' ఇంకా లియోసా అందం తాలూకు ప్రభావం నుండి తేరుకోకుండానే అన్నాను.

''అందుకేనేమో నీ మాటలు మచ్చలేని తెలుపులా మధురంగా ఉంటాయి!'' అంది.

''నీవేమో పాలు-పంచదార లేకుండానే నాకంటే ఎన్నో రెట్లు తియ్యగా మాట్లాడుతున్నావ్,'' అన్నాను మంచి జవాబిచ్చానన్న ధీమాతో.

''ఎంతైనా మీ దేశం వారు పటాటోపం లేకుండా పొదుపుగా ఉంటారు. మాటల్లో పొదుపు. తిండిలో అవశ్యమైనవే ఉంటాయి. ప్రాక్టికల్‌గా ఉన్నట్టనిపిస్తుంది. ఎండాకాలంలో నిక్కర్లతో ఆఫీసు కెళ్లొచ్చు!'' అంటూ ఉదాహరణలను వివరించాను.

నవ్వుతూ వింటోంది లియోసా.

''మనిద్దరినే చూడు, ఇక్కడ! నేనేమో కుర్తా పైజమాలో ఉన్నాను. అరచేతుల వరకు కప్పే కుర్తా, మడమల వరకు జారే పైజామా. అదే నీ బట్టలు చూడు- తొడల వరకే ఉన్న స్కర్టు, పొట్టి చేతుల బ్లౌజు, స్ట్రాప్‌లెస్ బ్రాసియర్- ఎంత ఎకానమీ ఉందో చూడు ఈ బట్టల్లో!''

పొట్ట చెక్కలయ్యేలా నవ్వుతోంది.

నవ్వినా కన్నీళ్లొస్తాయన్న సాక్ష్యం నాముందుంది. కొంతసేపటికి కాని తేరుకోలేదు లియోసా.

మృదువుగా, నాజూగ్గా ఉన్న కాళ్లకు అంటుకుని ఉన్న స్టాకింగ్స్ వైపు కొంటెగా, కుతూహలంతో చూస్తున్నాను. స్టాకింగ్స్‌ను చూస్తుంటే ఈర్ష్య కలిగింది. నాకు సౌకర్యం కోసం అప్పుడప్పుడు కాళ్లను ఒకదానిపై మరొకటి మోపడానికి మారుస్తోంది.

''నీ నుండి ఆదివారాన్ని దొంగిలిద్దామని వచ్చాను!'' చిలిపిగా అంది.

''ఆదివారం నుండి నన్ను దొంగిలించు!'' చిలిపిదనాన్ని నేనూ చిలికాను.

''నేను జోక్ చేయడం లేదు! నిజంగానే నిన్ను మా ఇంటికి తీసుకెళ్లడానికి వచ్చాను!'' అంది.

''లంచ్ మా ఇంట్లోనే అరేంజ్ చేస్తున్నాం. మా అమ్మా, నాన్నా నిన్ను చూడటానికి కుతూహలంతో ఉన్నారు. వెంటనే రెడీ అవ్వు!'' అంది లియోసా.

నాకు చెప్పుకోదగ్గ పనేమీ లేకపోవడంతో బట్టలు, మార్చుకుని సిద్ధమయ్యాను.

సైకిల్‌పై కూర్చోబెట్టుకుని ఇంటికి తీసుకెళ్లింది. లియోసా ఒక్కతే సంతానం కావడం వల్ల ఇంట్లో తల్లిదండ్రులు తప్ప మరెవ్వరు లేరని, నేను లోపలికి అడుగుపెడుతూనే గమనించాను.

గుడ్‌మార్నింగ్‌ను చైనీ భాషలో, ''తౌచాంగ్ హావ్!'' అని విష్ చేశాను.

ఆశ్చర్యంతో వారు లియోసావైపు చూసి నవ్వుతూ, కూర్చోమని సీటు చూపారు.

నేను కూర్చుంటూ, 'షె...షె!' అని మళ్లీ చైనీ భాషలో కృతజ్ఞతలు తెలిపాను. నేను గ్రహించిన చిన్న చిన్న చైనీపదాల ఉచ్చారణ పట్ల మరోమారు ఆశ్చర్య పడ్డారు. దీన్నంతా లియోసా గమనిస్తూనే ముసిముసిగా నవ్వుతోంది. లియోసా నాన్నకు ఇంగ్లీషు మామూలుగా వచ్చు. మెల్లగా మాట్లాడగలడు. తల్లికి ఇంగ్లీషు అసలే రాదు.

లియోసా తండ్రి మా ట్రైనింగ్ గురించి రకరకాల ప్రశ్నలు వేసి వివరాలు తెలుసుకోవడంలో ఎంతో ఉత్సాహం చూపించాడు. మధ్యమధ్యలో ఇండియా-చైనా సంస్కృతి పట్ల, పరస్పర సంబంధాలపై కూడా సంభాషణలు సాగాయి. కొన్ని ముఖ్యమైన విషయాలను భార్యకు చైనీ భాషలోకి తర్జుమాచేసి వివరిస్తున్నాడు. ఆమె అడిగిన ప్రశ్నల్ని ఇంగ్లీషులో నన్నుగడి, జవాబులు తెలుసుకుని, మళ్లీ వివరిస్తున్నాడు. లియోసా అక్కడ లేకపోవడం గమనించి, ''మన ప్రొఫెషనల్ ఇంటర్‌ప్రిటర్ ఎటు తప్పించుకుంది?'' అని అటూ, ఇటూ చూస్తూ అడిగాను.

కాసేపటికి వరకూ ఎవరూ మాట్లాడలేదు. అందరమూ లియోసా గురించి ఎవరి పద్ధతిలో వారు ఆలోచిస్తున్నట్లుంది. అందరూ హృదయమున్న మనుషులే అక్కడ! గాయపడిన లేత హృదయమొకటి లియో రూపంలో టీతో మెల్లగా నడుస్తూ వచ్చింది.

మళ్లీ ఓ అరగంటవరకు సంభాషణలు సాగాయి. చైనాలో కుటుంబ నియంత్రణ, కొత్తగా ప్రవేశపెట్టిన సంస్కరణల ప్రభావం, మహిళల పురోగమనం, ఒకటేమిటి ఎన్నో అంశాలపై ముచ్చట్లాడాం. తల్లికి ఇంటర్‌ప్రిటర్‌గా పనిచేస్తూ, నాకూ, తన కుటుంబానికీ సంధాన కర్తగా పనిచేసింది లియోసా.

లంచ్ సర్దడానికి లియోసా, ఆమె తల్లి అక్కడి నుండి నిష్క్రమించడంతో నేను, లియోసా తండ్రి మిగిలిపోయాం. ఆయనే మెల్లగా సంభాషణ మొదలు పెట్టాడు.

''నీ గురించి చాలా చెప్పింది లియోసా. రోజూ ఏదో ఒకటి చెబుతూనే ఉంటుంది. నీ గురించి, నీ వ్యక్తిత్వం గురించి చెబుతున్నప్పుడు ఎంతో ఉత్సాహంగా వుంటుంది...''

క్షణాలు దొర్లుకుంటూ రెండు నిముషాలయ్యాయి. ఆయనేదో- బహుశా శూన్యంలోకి చూస్తున్నాడనుకుంటాను. నేను ఆయన పైనే దృష్టిని కేంద్రీకరించాను. మాటలింకా మిగిలి ఉన్నట్లనిపించి నేనేమీ మాట్లాడకుండా ఆయనవైపే చూడటం కొనసాగించాను.

''జాంగ్ వెళ్లిపోయాక లియోసా ఇంత సంతోషంగా ఉండటం మొదటిసారిగా గమనిస్తున్నాం!'' నిశ్చలంగా శూన్యంలోకి చూస్తున్న ఆయన ముఖంలో సన్నగా వణుకుతున్న పెదిమల నుండి వచ్చాయి ఈ మాటలు.

కళ్లద్దాలు తీసి, కనుకొలకుల్లోంచి స్థానభ్రంశం చెందడానికి సిద్ధంగా ఉన్న నీటిచుక్కల్ని చేత్తో తుడిచేశాడు. ''థాంక్యూ ఫర్ యువర్ ఫ్రెండ్‌షిప్! థాంక్యూ ఫర్ యువర్ కంపెనీ! థాంక్యూ ఫర్ యువర్ కన్‌సర్న్!'' హృదయపు లోతుల నుండి మెల్లగా వచ్చాయా మాటలు, బరువుగా ఉన్నాయి.

లియోసా వచ్చి లంచ్‌కు ఆహ్వానించడంతో ఆ ఘట్టం అక్కడితో ముగిసింది.

లియోసా తల్లిదండ్రుల ఆప్యాయత, అభిమానం నా హృదయంలో చోటుచేసుకున్నాయి. వారిని కలుసుకోవడంతో లియోసా మరింత దగ్గరయినట్లనిపించింది.

ట్రైనింగ్ ఇంకో మూడురోజులైతే పూర్తవుతుంది. ఆరువారాలకే చాలామందికి హోమ్ సిక్‌నెస్ వచ్చేసింది. ఈ మూడు రోజులూ ఎంత తొందరగా గడిస్తే అంత బాగుండు అనుకుంటున్నారు. లియోసా రోజూ సాయంత్రం నా గదిలోకి వచ్చేది. మిగతా ట్రైనీలు ఏమనుకునేవారో నేనెప్పుడూ పట్టించుకోలేదు. ఆమె గదిలో ఉన్నంతసేపూ సమయం క్షణాల్లో గడిచేది. ఒకరి సాన్నిహిత్యం మరొకరికి బాగా నచ్చేది. మా అభిరుచులు, విషయ పరిజ్ఞానం, మేధ మమ్మల్ని ఒకరిపై మరొకరికి గౌరవాన్ని గుమ్మరిస్తే, మా మధ్యనున్న ఆడమగ తేడాలు యాదృచ్ఛికంగా గాలికేమాత్రం ప్రభావితం కాని చిరుదివ్వెలా వెలగడం మెల్లమెల్లగా గ్రహించ సాగాను. సామాజిక పరిస్థితులు, రాజకీయ నిబద్ధతలు జ్ఞాపకానికొచ్చి లక్ష్మణరేఖలై నిలిచేవి. అంతర్జాతీయ సరిహద్దు రెండు దేశాల్ని కలుపుతున్నా దాన్ని విడదీసే రేఖగానే భావిస్తాం. రెండు దేశాల మధ్య గల సంబంధాలు నేతి బీరకాయలోని నెయ్యంత మాత్రమే! లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్ దగ్గరి గస్తీ బలాలకు మా ప్రేమ గురించి ఎలా తెలిపేది? మా ఇద్దరి ప్రేమ గురించి ఆలోచించే దెవరు? మతం, వర్ణం, జాతీయత ఎరగని ప్రేమ మనసుల వేదన, గుండెల చప్పుడు ఇరువైపు దేశాల దౌత్య సంబంధాలను పెంపొందించ గలవా? ప్రజాస్వామ్య పోరాటంలో ప్రాణాల్ని తన గడ్డ పైనే వదులుకున్న జాంగ్ ముందు పొరుగు దేశస్థుడినైన నేను లియోసాను వదులుకోవాలి. లియోసా నన్ను

మరిచిపోవాలి. మనుషులేర్పరిచిన చట్టాలే మనసున్న మనుషుల్ని విడదీస్తున్నాయి.

ఎంత మంచి ఘట్టమైనా ఎప్పుడో ఒకసారి పూర్తి కావలిసిందే! నేను చెండు నగరం వదిలేరోజు రానే వచ్చింది. కొందరు ట్రైనీలు తమ ఫ్లయిట్ కనెక్షన్‌లను బట్టి ఓరోజు ముందుగానే బయలుదేరారు. నా తిరుగు ప్రయాయణం మళ్లీ బీజింగ్ మీదుగా. బాధగా ఉంది. ట్రైనింగ్ ఇంకో ఆర్నెల్లు ఉంటే బాగుండునన్న అసాధారణమైన కోరిక కలిగింది. అందుకు కారణం లియోసా అని ప్రత్యేకంగా చెప్పే అవసరం లేదు. లియోసాకై మరీ విపరీతమైన ఆలోచనలు వచ్చేవి. వెంటనే వాటినన్నింటినీ ఆచరణయోగ్యం కావని తోసిపుచ్చేది. మనుషులమైనందుకు ఎన్ని బాధలు పడాలో అర్థమవుతోందని ఏడ్చేది. మనసున్న మనుషులకు మరింత ఎక్కువని నేను మహాజ్ఞానిలా ఓదార్చాను.

ఫ్లైట్ టైమ్‌కే బయలుదేరుతుందని తెలుసుకుంది. ఇక కొన్ని నిముషాలే లియోసాతో గడిపేది! మళ్లీ కలుసుకుంటామన్న ఆశలేదు. చైనాలో అడుగుపెట్టిన మరునాటి నుండి ఇప్పటివరకు పెనవేసుకుపోయిన మా బంధం అంతిమ ఘడియలు ఎలా ఉంటాయో, ఏమో! నీళ్లు నిండుకుంటున్నాయి నాకు. గొంతు ఎండిపోతోంది. మాటలు రావడం లేదు. చైనీ భాషలో ఇక చివరిసారిగా సంబోధించి సెలవు తీసుకుందామని "తైజేఁ" అంటూ చేయి ముందుకు చాచాను.

లియోసా మాత్రం మామూలుగానే ఉంది. నేను వెళ్లిపోతున్నానన్న భావప్రకటనను తన ముఖంలో ప్రస్ఫుటంగా గమనించలేకపోతున్నాను. తనూ చేయి ముందుకు చాచింది. ఆప్యాయంగా, మృదువుగా లియోసా చేతిని నాకు తెలియకుండానే కొంచెంసేపటివరకు అలాగే పట్టుకున్నాను. లియోసా ఎడబాటును భరించగల శక్తి ఏదో నా రక్తంలో మిళితమవసాగింది. లియోసా చైతన్యరహితంగా ఉంది. చేతిని కాస్త పైకెత్తి ముందుకు వంగి లియోసా చేతిపై ముద్దుపెట్టాను. చిరునవ్వుతో స్వీకరించింది. అంతే! చేయి వదిలి ట్రాలీని తోసుకుంటూ "తైజేఁ" అంటూ చేయి ఊపుకుంటూ లోపలికి బయలుదేరాను.

రెండు గంటల ప్రయాణంలో చెండు నుండి బీజింగ్ చేరుకుంటాను. నేను కిటికీ నుండి వింగ్ మీదుగా పరిసరాలను చూస్తున్నాను. బయలుదేరడానికి ఇంకా టైముంది. మనసంతా వెలితిగా ఉంది. పక్కనున్న ఖాళీ సీట్లో ఎవరో వచ్చి కూర్చుంటే తల తిప్పి చూశాను.

నా కళ్లను నమ్మలేకపోయాను.

లియోసా!

సంతోషం, ఆశ్చర్యం రెండు ముఖంలో నుంచి బయట పడటానికి పోట్లాడుతున్నాయేమో ఓ క్షణం మాటలు రాలేదు నాకు. లియోసా మాత్రం నా బేలతనాన్ని చూసి అదేపనిగా నవ్వసాగింది. ఆ నవ్వుల్లో పువ్వుల్ని ఏరుకున్నాను. మెల్లగా అర్థమవుతోంది, నేననుకున్న ఆఖరి కలయిక కాదని తనకు తెలిసి మామూలుగా ఎందుకు ప్రవర్తించిందో. తనకూ మనసుందని, తన శరీరమూ ఎడబాటుకు ప్రకంపిస్తుందని అంచనా సరిగ్గా వేయనందుకు నాకు సిగ్గేసింది. నేను మామూలు మనిషినయ్యేంతవరకు నవ్వుతూనే ఉంది. నవ్వినంతసేపూ తన చిన్న కళ్లు చిత్రంగా మూసుకున్నాయి.

లియోసా సుతారంగా నా భుజంపై తలను మోపి నా చేతిని తన చేతుల్లోకి తీసుకుంది. నెమ్మదిగా నిమురుతోంది. "నేను కావాలనే నిన్ను సర్‌ప్రైజ్ చేశాను. నువ్వు నన్నెప్పటికి మరువవుకదూ?" నిమురుతున్న నా చేతుల్ని గట్టిగా పట్టుకుంటూ అంది. మళ్లీ తనే అంది.

"ఒక జాంగ్‌ను బీజింగ్ పంపి ఎప్పటికీ లేకుండా చేసుకున్నాను. మరో జాంగ్‌ను కూడా ఒంటిరిగా బీజింగ్ పంపి దూరం చేసుకోలేను. అందుకే నా దేశంలో ఉన్నంతవరకు నీతోనే ఉండాలని ఇలా వచ్చేశాను. నా మనసు చెప్పిన ప్రకారం నడుచుకున్నాను. నిన్ను మీ దేశానికి పంపించి నేను చెండు వెళ్లిపోతాను. నా జాంగ్ ఎక్కడో పృథ్విపైన జీవించే ఉన్నాడన్న తృప్తి నాకుంటుంది!" నా చేతుల్ని వదిలేసి నుదుటిపై ముద్దుపెట్టుకో డానికి నా ముఖాన్ని దగ్గరగా తీసుకుంది లియోసా.

ఏర్‌హోస్టెస్ ఆక్సిజన్ మాస్క్‌ను ఎలా ఉపయోగించాలో వ్యాఖ్యానసహితంగా ప్రయాణికులకు చూపుతోంది.

*ఆంధ్రప్రభ వారపత్రిక సెప్టెంబర్ 28-4 అక్టోబర్ 1994*

